# దేహం విడిచిన ఏ ఆత్మ స్వప్నంలో కనిపిస్తుంది?

గత జన్మ ఋణబంధాలతోను, అనేకానేక ఋణ శేషాలతోను లేదా దైవ కార్యాన్ని ఈ భూమిపై నిర్వర్తించుటకు గాను 'ఆత్మలు' ఈ భూమిపై మానవ జన్మ దాల్చుచున్నారు. ఈ విధమైన జన్మను 27 నక్షత్రాలలో ఏదో ఒకటి జన్మ ఎత్తుటకు సహకరిస్తుంది.

ఈభూమిపై దేవతులు, కిన్నెర, కింపురుషులు, రాక్షసులు, యక్షులు, పిశాచాలు, ఋషి మండలంలోని ఋషీశ్వర్లు, పిత్రులోకంలోని పిత్రాత్మలు ఈ భూమిపై మానవ జన్మని ధరించుచున్నవి. మొత్తం 14 లోకాల ఆత్మలు వచ్చుచున్నవి.

ఈ భూమిపై ఋణం తీరడంతో ఆత్మ దేహం విడిస్తుంది. మానవ జన్మపొందిన రాక్షస ఆత్మలు, అదే విధంగా పిశాచాలు వారి వారి మానవ దేహాలను సాటి మనిషి మరణానికి బాధలకు గురి చేస్తాయి. అవి వాటి వాటి రక్త పిపాసను నెరవేర్చుకొంటాయి.

హత్యలు, దుర్గార్గ పనులు, అన్యాయపు పనులను ఈ భూమిపై నిర్వర్తించి ఆ తదుపరి దేహం విడిచిన ఆత్మ మరణానంతరం తన వారెవరికి స్వప్నములలో కనిపించదు. ఎందుకంటే అట్టి 'ఆత్మ'ని ప్రకృతి తనలో ఉండనివ్వకుండా అట్టి ఆత్మ పాపచర్యల ఆధారంగా అధమ లోకాలకి నెట్టివేస్తుంది. అందుచేతనే దుర్మార్గులు, హంతకులు మరణానంతరం ఏ ఒక్కరికి కనిపించరు.

మరి న్యాయబద్ధంగాను ధర్మబద్ధంగాను ఈ భూమిపై జీవించి దేహం విడిచిన ఆత్మ మరణానంతరం తదుపరి తన వారిలో చాలా మందికి స్వప్నములో కన్పించు చున్నది. ఈ విధమైన ఆత్మలు దేవలోకం, పిత్రు లోకం, ఋషి లోకం ఇత్యాది ఊర్ధ్వ ముఖ పుణ్యలోకాలకి వెళ్ళిపోతుంది. ఆ లోకాలలో ఈ ఆత్మకు ఎలాంటి నిర్బంధం, నియంత్రణ ఉండదు. అందుచేతనే ఈ విధమైన ఆత్మ దేహం విడిచాక అవసరమైనపుడు తనవారికి స్వప్నములో కన్పిస్తూ ఉంటుంది. ప్రకృతి అనుమతించాక మరలా తన యిష్టమైన తనవారి కుటుంబలో పునః జన్మ పొందుతుంది.

ఈ ప్రపంచంలో ఈనాటి వరకు జన్మించి ఎంతోమంది మరణాలకు కారకులైన భయంకర దుర్మార్గులెవ్వరూ వారివారి మరణాంతరం ఈ రోజు వరకూ ఏ ఒక్కరికి స్వప్నములలో కన్పించలేదు. మానవరూపంలో భయంకర రాక్షసులు, భయంకర పిశాచాలు, ధన పిశాచాలు, అధికార పిశాచాలు, ఋషీశ్వర్లు, దేవతలు, యక్షులు, గాంధర్వులు, కింపురుషులు జన్మిస్తుంటారు.

దుర్మార్గ ఆత్మలను వదిలించుకోడానికి పంచభూతాలు ఎల్లప్పుడూ కృషి చేస్తుంటాయి. 'పుణ్య' ఆత్మలను తమలో ఎల్లప్పుడు ఉంచుకోడానికి ప్రకృతి పరితపిస్తుంది.

బ్యాంకు ఖాతాలో జమ నిల్వ ఉన్న సొమ్మువలె గత జన్మలో నిల్వ ఉన్న పుణ్యం నిల్వ పూర్తియ్యేంత వరకు ఎలాంటి దుర్మార్గుడుని ప్రకృతి ఏమి చెయ్యలేదు. ఆ పుణ్య ఖాతాలోని నిల్వ అయిపోయిన వెంటనే అట్టి దుర్మార్గుడిని ఈ ప్రకృతి భస్మం చేసేస్తుంది.

మనిషి తనెంతటి పాపపు పనులు, దుర్మార్గ పనులు, అవినీతి, అధర్మం పనులు చేస్తున్న తనకు ఎలాంటి నష్టం జరగడం లేదని భావించి క్షణక్షణం రెచ్చిపోతుంటాడు, కాని గత జన్మ పుణ్యం నిల్వ తీరిన తదుపరి అతనిని ప్రకృతి అత్యంత క్రూరంగా శిక్షించడం ప్రారంభిస్తుంది. యిక్కడ అతని పాపాలను అతని వంశాలు అనుభవిస్తాయి. విషపు నవ్వు, కపట నవ్వు, మాయ లేవి ప్రకృతిని నమ్మించలేవు. శాంతింపచేయలేవు.